సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 1 । జులై । 2024



రైతును ముంచుతున్న నకిలీ

అన్నమయ్య జిల్లా గుర్రంకొండలోని పలు దుకాణాల్లో డీలర్లు విక్రయిస్తున్న ఎరువులతో రైతులు నట్టేట మునిగి లక్షలాది రుపాయలు రైతులు నష్టపోతున్నారు. -8లో



ఆదమరిస్తే.. విషాహారమే

కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై ఆస్పత్రులపాలవడం సాధారణంగా మారింది. యంత్రాంగం పర్యవేక్షణ కొరవడడంతో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.390	రూ.460
రెండోరకం	రూ.300	రూ.360



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1217 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	270	495
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 141.580 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు జూలై 1వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ

రాయచోటి జగదాంబసెంటర్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ, గరల్స్ ఐటీఐ కాలేజీ పక్కన తిరుపతి రోడ్డు, కడప వారి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫాబ్రిక్ పెయింటింగ్‌లపై జూలై నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. 18 నుంచి 45 ఏళ్లలో వయసు కలిగి, ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళలు శిక్షణా కార్యక్రమాలకు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9440905478, 9985606866, 9440933028 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గంగమ్మా..కరుణించవమ్మా



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. చుట్టుపక్క ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాలనుంచి సైతం వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.బోనాలు సమర్పించారు.తలనీలాలు అర్పించారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులు భక్తులకు క్యూలైన్ల ద్వారా అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రత్యేకాధికారి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షణ చేపట్టారు.

ఆగస్ట్ 31 వరకు చేపల వేటకు విరామం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని గండికోట జలాశయం, బ్రహ్మసాగర్ జలాశయం, సోమశిల వెనక జలాలలో జులై 1వ తేదీ నుంచి ఆగస్ట్ 31వ తేదీ వరకు 62 రోజులపాటు చేపల వేట విరమించాలని కడప జిల్లా ఉప మత్స్య సంచాలకులు శాంత తెలిపారు. సహజంగా చేపల సంతానోత్పత్తి కాలం అయినందున.. చేపల సంరక్షణ కోసం ఈ జలశయాల్లో చేపల వేట విరామం పాటించాలని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ నియమ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సదరు జలశయాల్లో చేపల సంరక్షణ కోసం నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు ఒక ప్రత్యేక నిఘా కమిటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లైసెన్సు దారులు ఏ ఒక్కరు కూడా జులై 1 నుంచి ఆగష్టు 31వరకు 62 రోజుల పాటు గండికోట, బహ్మసాగర్ జలాశయాలతో పాటు సోమశిల వెనక జలాలలో చేపల వేటకు వెళ్లకూడదని ఆమె తెలిపారు.

స్విమ్మింగ్ జట్టు ఎంపిక



జిల్లాజట్టుకు ఎంపికైన క్రీడాకారులతో స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్. రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు జూలై 13, 14 తేదీల్లో కర్నూలు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ శిక్షకులు రాజేంద్ర, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

సబ్‌జూనియర్ విభాగం: జాన్ అఖిలేష్, కట్టా నిఖిలేష్, షణ్ముఖశ్రీ, వెంకటసాయి, లక్ష్మినారాయణ, త్రిభువన్‌రెడ్డి, చేతన్.

జూనియర్ విభాగం: యశ్వంత్, నాగవర్ధన్, కార్తిక్‌దేవరాయల్, మోక్షప్రియ.

చెరువులు వెలవెల



రాయచోటి సమీపంలోని కొండవాండ్లపల్లె చెరువులో చుక్కనీరు లేక బోసిపోయి కనిపిస్తున్న దృశ్యం

- జాడలేని వరుణుడు
- నీరులేక బోసిపోతున్నాయి
- ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం
- ఆందోళనలో అన్నదాతలు
- జిల్లాలో 3272 చిన్నా పెద్ద చెరువులు

రాయచోటి: రుతుపవనాలు వెనక్కి మళ్లడంతో వర్షాలు కురవక చెరువుల్లో నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ మొదటి వారంలోనే రుతువనాలు వచ్చి జల్లులు మాత్రమే పడ్డాయి. దీంతో చెరువుల్లో చుక్కనీరు లేదు. రైతులకు ఆసరాగా ఉండే చెరువులు పూడికతో నిండిపోయాయి. పూడిక తొలగించకపోవటంతో ఒకటి, రెండు వర్షాలకే చేరిన కొద్దిపాటి నీటికే చెరువులు నిండి తెగిపోతున్నాయి. దీంతో ఆయకట్టు చివరి దశకు వచ్చే సరికి నీరు అయిపోయి పంటలు ఎండిపోతున్నాయి. గత ఏడాది తగినంత వర్షాలు లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చుక్క నీరు లేక వట్టిపోయి కనిపిస్తున్నాయి. చిన్నపాటి కుంట నుంచి వంద ఎకరాలకు పైగా సాగు అందించే చెరువులు కూడా నీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. జిల్లాలో వంద ఎకరాలకు పైబడి సాగు అందించే 154 చెరువులు ఉన్నాయి. వీటి కింద 53,407 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే వంద ఎకరాల లోపు సాగును అందించే 3118 చెరువులు ఉన్నాయి. వీటి కింద 46666 వేల ఎకరాల ఆయకట్టు సాగు అవుతుంది. కోడూరు పరిధిలో 43 పెద్దవి.. 84 మిగతా చెరువులు ఉన్నాయి. రాజంపేట పరిధిలో 16 పెద్దవి, 289 చిన్న చెరువులు ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంలో 13 పెద్దవి , 770 చిన్న చెరువులు ఉన్నాయి. మదనపల్లె పరిధిలో 19 పెద్దవి, 380 చిన్న చెరువులు, తంబళ్లపల్లె లో 28పెద్దవి, 707 చిన్న చెరువులు ఉన్నాయి. అలాగే పీలేరు డివిజన్ పరిధిలో 35 పెద్దవి , 888 చిన్న చెరువులు ఉన్నాయి.


అడుగంటుతున్న రిజర్వాయర్లు

అనుకున్న మేర వర్షాలు లేకపోవడంతో జిల్లాలో ఉన్న రిజర్వాయర్లలో కూడా నీరు రోజురోజుకు అడుగంటిపోతోంది. కర్ణాటకలో కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు వెలిగల్లు,పెద్దేరు, చిన్నేరు జలాశయాల్లోకి కొద్దిపాటి నీరు వచ్చి చేరుతుండడంతో ఆయా ప్రాంతాల్లోని పట్టణాలు, ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందిని తీరుస్తున్నాయి.రాయచోటి సమీపంలోని మండిపల్లె నాగిరెడ్డి రిజర్వాయర్, ఝరికోన ప్రాజెక్టు, తంబళ్లపల్లె పరిధిలోని దబ్బలగుట్ట, ఆకుమానిగుట్ట రిజర్వాయర్లు, కె.వి.పల్లె సమీపంలోని అడవిపల్లె, కోడూరు నియోజకవర్గ పరిధిలోని వాగేటి కోన, చాకిరేవు కోన, గొట్టిమాను కోన రిజర్వాయర్లలో ఉన్న నీరు ఇంకిపోతోంది. రాజంపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు ఇంకా పునర్మిణానికి నోచుకోలేదు.

ఆశలొదిలిన రైతులు: జిల్లాలో తరతరాలుగా రైతులకు తిండి గింజలకు ఆదరువుగా ఉన్న చెరువులకు ఇటీవల కాలంలో కొద్ది నీరు కూడా చేరలేదు. అసలే నీరు వచ్చేది ఎప్పటికో.. అది కూడా పొలాలకు చేరకపోవటంతో రైతాంగం చెరువు ఆయకట్టుపై ఆశలు వదులుకుంటున్నారు. చెరువులు, ప్రాజెక్టుల నుంచి పొలాలకు అందే కాలువులు ఆక్రమణలకు గురై వాటి రూపు కోల్పోయాయి. ఇక్కడో కాలువ ఉండాలి..కనపడటం లేదు అనే స్థాయికి వెళ్లింది.

చెరువులకు చేరని నీరు..

నిత్యం కరవు కాటకాలకు నిలయంగా ఉన్న ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాల పరిధిలో ఉన్న చెరువులకు కృష్ణా జలాలను అందించేందుకు దివంగత నేత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల పాలనలో హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల ద్వారా చాలా వరకు ప్రయత్నాలు జరిగాయి. నాడు వైఎస్సార్ మరణం తర్వాత ప్రాజెక్టులు ముందుకు కదలలేదు. తర్వాత అన్నమయ్య జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులకు నీటిని అందించేందుకు గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టు పథకం కూడా ప్రస్తుతం తాత్కాలికంగా ఆగిపోయింది. దీంతో కృష్ణా జలాలు చేరి చెరువులు నిండుతాయని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశ ఎదురైంది



వాన కోసం ఎదురుచూపు

జిల్లాలోని 30 మండలాల్లో ఏ ఒక్క చెరువులోనూ నీళ్లు లేక అలంకార ప్రాయంగా ఉన్నాయి. జిల్లాలో ఉన్న 3272 చిన్నా, పెద్ద చెరువుల కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో వర్షాధారంగా వేరుశనగ, టమాటా, కంది, ఆముదం, అలసంద, పెసర, జొన్న తదితర పంటలను సాగు చేస్తారు. చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల కింద వరితో పాటు ఇతర నీటి ఆదరవు పంటలను సాగు చేస్తుంటారు. ఉన్న నీటితో సూక్ష్మ, తుంపర సేద్యాల ద్వారా ఆరుతడి పంటలైన కూరగాయలు, పూలతోటలు, పండ్ల తోటలను జిల్లాలో అధికంగా సాగవుతున్నాయి. వర్షాలు కురవకపోతే సాగైన పంటలు చేతికందే పరిస్థితులు ఉండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకుకూరలు, కూరగాయల పంటల దిగుబడి తగ్గడంతో ఇప్పటికే మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశం వైపు పరుగులు తీస్తున్నాయి. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ఆశలన్నీ వర్షాలపైనే..



జిల్లాలో ఎండిపోయిన చెరువులు, ప్రాజెక్టుల్లోకి నీరు చేరాలంటే వర్షాలపైనే ఆశలు పెట్టుకున్నాం. చెరువులలో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. రుతుపవనాల అనుకూలించి మంచి వర్షాలు కురుస్తాయన్న ఆశలు ఉన్నాయి.

–నల్లపురెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా వాటర్ రిసోర్స్ అధికారి, అన్నమయ్య జిల్లా

లోక్ అదాలత్‌లో 2367 కేసులకు పరిష్కారం

- రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు రెండో ర్యాంక్



కడప అర్బన్: జాతీయలోక్ అదాలత్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా 29వ తేదీన 22 బెంచీలలో జరిగింది. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో కడపలో 6 బెంచీలు, ప్రొద్దుటూరులో 4 బెంచీలు, రాజంపేటలో 1, రాయచోటిలో 4, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరులలో ఒక్కో బెంచీని ఏర్పాటు చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 2367 కేసులను కేసులను పరిష్కరించారు. క్రిమినల్ కేసులు 2036 కేసులు, 217 సివిల్ కేసులు, 114 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం అయ్యాయి. ఈకేసులకుగాను కక్షిదారులకు రూ.16,57,23,983 చెల్లించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసుల పరిష్కారంలో జిల్లా రెండవ ర్యాంకును సాధించారు. కడపలో 526 కేసులు, ప్రొద్దుటూరు 431 కేసులు, రాజంపేటలో 44 కేసులు, రాయచోటి కేసులు 103 కేసులు, బద్వేల్‌లో 327 కేసులు, జమ్మలమడుగు 490 కేసులు, సిద్దవటం 86 కేసులు, రైల్వేకోడూరులో 24 కేసులు, పులివెందులలో 181 కేసులు, నందలూరు 34 కేసులు, లక్కిరెడ్డిపల్లి 47 కేసులు, కమలాపురం 74 కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యాయి. జాతీయలోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేసిన న్యాయవాదులకు, ప్రభుత్వ అధికారులకు, సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

అతిసార నియంత్రణకు చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: అసార వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వతేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో అతిసార వ్యాధి నియంత్రణపై అవగాహన కార్యక్రమాలను అనుబంధ శాఖలతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని వైద్య,ఆరోగ్య శాఖాధికారులకు సూచించారు.ఇప్పటికే జిల్లాస్థాయిలో జేసీ ఆధ్వర్యంలో వైద్య,ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల అధికారులు నిర్వర్తించాల్సిన విధులపై దిశానిర్దేశం చేశారన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు నీటినాణ్యత పరీక్షలు నిర్వహించి ఫలితాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ, ఏఎస్‌ఎంలు గృహ సందర్శనలు నిర్వహించి 5 సంవత్సరాల వయస్సున్న పిల్లల ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలస్థాయిలో ఎంపీడీఓ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించి ఎస్‌హెచ్‌జీల సభ్యులకు, వీఓలకు అవగాహన కలిగించాలన్నారు. ఆరోగ్యకార్యకర్తలు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేయించడం, ట్యాంక్‌ల్లో నీటిలో క్లోరినేషన్ చేయించడం, పైపులైన్ లీకేజీలను గుర్తించి అరికట్టేలా చూడడం లాంటివి చేపట్టాలన్నారు. అందరూ కలసికట్టుగా కృషిచేయడం ద్వారా అతిసార వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని డీఎంహెచ్‌ఓ వివరించారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

రేపటి నుంచి గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్

కలికిరి: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 2, 3వ తేదీల్లో కలికిరి గురుకుల పాఠశాల నందు కౌన్సెలింగ్ జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో బాలురకు సత్యవేడు, ఐతేపల్లి, సదుం, తంబళ్లపల్లి, కుప్పం పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతులలో 164 సీట్ల భర్తీకి 328 మందికి 2వ తేదీ మంగళవారం, బాలికలకు కలికిరి, పీలేరు, ఉదయమాణిక్యం, పెద్దపంజాణి, పులిచెర్ల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతులలో 122 సీట్లకు గాను 244 మందికి 3వ తేదీన బుధవారం కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్ అర్హత పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చామని, కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరవ్వాల్సిన అవసరం లేదన్నారు. తల్లిగానీ, తండ్రిగానీ ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థి ర్యాంక్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అలాగే కౌన్సెలింగ్ రోజున ఉదయం 10 గంటలకు హాజరవ్వాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత సమయంలో రాకపోతే అడ్మిషన్ కమిటీ బాధ్యత వహించదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000715637, 8790092069 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



కలికిరిలోని గురుకుల పాఠశాల

కిసాన్ అర్హతలపై ఆరా!

- పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాపై విచారణ
- మొత్తం లబ్ధిదారుల్లో 5 శాతం మందిని పరిశీలించాలని ఆదేశాలు
- జిల్లాలో 15245 మంది వివరాల పరిశీలనకు చర్యలు
- ఇప్పటివరకు 9269 మందిని పరిశీలన పూర్తి
- ఇటీవలే రైతు ఖాతాలకు పీఎం కిసాన్ నిధులు జమ



మాదవరం సచివాలయంలో లబ్ధిదారుల ఫోటో తీస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకురాలు

కడప అగ్రికల్చర్: పంటల సాగులో రైతన్నలకు తమ వంతు సాయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద ఏటా అర్హులైన రైతులకు రూ.6 వేల చొప్పున అందిస్తోంది. సంబంధిత డబ్బులను మూడు విడతల్లో ఒక్కోసారి రూ. 2 వేల చొప్పున వారి ఖాతాలకు జమ చేస్తుంది. ఈ లబ్ధిపొందుతున్న వారంతా నిజ మైన రైతులా లేక అనర్హులేమైనా లబ్ధి పొందుతున్నారనే దానిపై అప్పుడప్పుడు కేంద్ర ప్రభు త్వం విచారణ చేపడుతుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ప్రస్తుతం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథక లబ్ధిదారుల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయశాఖ చేపట్టింది. లబ్ధిదారుల్లో అనర్హులేమైనా ఉన్నారా.. ఉంటే తొలగించే చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు మొ త్తం లబ్ధిదారుల్లో 5 శాతం మంది వివరాలను ఆరా తీసి ప్రత్యేక యాప్‌లో వారి వివరాలను అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు అందాయి. ఇందులో పరిశీలించాల్సిన రైతులు జాబితాను కూడా వారే పంపా రు. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది 2022- 23, 2023-24 సంవత్సరాల్లో పీఎం కిసాన్ పథకం కింద లబ్ధిపొందిన అభ్యర్థుల వివరాలను ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా.. లేదా ..అనర్హులేమైనా లబ్ధి పొందుతున్నారా తదితర వివరాలను సేకరిస్తున్నా రు. ఇందులో భాగంగా లబ్ధిదారుల ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో గత వారంలో రోజుల నుంచి ముమ్మరంగా సాగుతుంది. మరో వారంలో ఈ కార్యక్రమం పూర్తికానుంది.

పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు ఇలా..

ప్రస్తుతం జిల్లాలో పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 1,85,607 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఇటీవలే 17వ విడత కింద కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు రూ. 2 వేల చొప్పుల రైతు ఖాతాలకు నగదును జమ చేసింది. జిల్లామొత్తంపైన 1,85,607 మందికి కలిపి రూ. 37.38 కోట్లను రైతు ఖాతాలకు జమ చేసింది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అమలు చేస్తోంది.



పరిశీలిస్తున్న అంశాలివే..

- పీఎం కిసాన్ పొందే రైతులేమైనా ఆదాయపన్ను కడుతున్నారా
- భూమి లేని రైతులు లబ్ధి పొందుతున్నారా
- ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ లబ్ధి పొందుతున్నారా
- ఒక కుటుంబంలో ఒక లబ్ధిదారుల ఉంటుండగా మరోక లబ్ధిదారుడికి పథకం వర్తిస్తోందా
- ఆధార్ మనుగడలో లేకపోవడం... ఏపీ నుంచి వలస వెళ్లిపోవడం
- డూప్లికేట్ రిజిస్ట్రేషన్ .. భూమిసాగు చేయకుండా వదిలివేయడం
- పీఎం కిసాన్ పొందుతూ భౌతికంగా ఉంటున్నారా లేదా
- 18 ఏళ్లలోపు వయసు ఉన్న వారికి ఎవరికైనా పథకం వరిస్తుందా
- ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొంది ఫింఛన్‌దారుడై ఉండి పీఎం కిసాన్ పొందుతున్నావారు ఎవరైనా ఉన్నారా
- భూమి వివరాలు సరిపోకపోయినా.. 2019 తరువాత భూమి రిజిస్టర్ కావడం వంటి అంశాలేమైనా ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు.

ఆకాశంలో అరుణ వర్ణం



మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆదివారం సాయంత్రం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణ నడిబొడ్డున కోమటివాని చెరువులో ఆకాశం అరుణ వర్ణంలో కనువిందు చేసింది. నింగిలో కుంకుమ ఆరబోసినట్లుగా తాజాగా ఆవిష్కృతమైన ఈ సుందర దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. సాయం సంధ్య వేళ ఆకాశంలో కనిపించిన మార్పునకు ప్రకృతి ప్రేమికులు ఫిదా అయ్యారు.

– మదనపల్లె సిటీ

క్లుప్తంగా

రైల్వే వంతెన కిందకు దూసుకెళ్లిన కారు



కనుమలోపల్లె రైల్వే వంతెన కిందకు దూసుకెళ్లిన కారు

సిద్దవటం : వేగం అదుపు చేసుకోలేక రైల్వే వంతెన కిందకు కారు తీసుకెళ్లడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..సిద్దవటం మండలం కనుమలోపల్లె గ్రామ సమీపంలోని కోతుల మోరీ వద్ద మలుపు ఉంది. కడపకు చెందిన రమేష్, కిశోర్ కారులో వేగంగా వస్తూ లారీని తప్పించబోయి అదుపు తప్పి రైల్వే వంతెన కిందకు దూసుకెళ్లారు. ఈ ప్రమాదంలో రమేష్, కిశోర్, మరొకరికి గాయాలవడంతో 108 వాహనంలో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు.

ఘర్షణలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ చింతయ్యగారికుంటకు చెందిన కొండప్ప కుమారుడు శ్రీనివాసులు 17 సంవత్సరాలుగా అదే గ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి వివాహం చేసుకోకుండా, కుటుంబ సభ్యులు తెచ్చిన సంబంధాలు నచ్చలేదని చెబుతూ వస్తోంది. ఈ క్రమంలో శ్రీనివాసులు కారణంగానే తమ అమ్మాయి పెళ్లి చేసుకోలేదనే కోపంతో ఆదివారం అమ్మాయి తండ్రి వెంకటరమణ, తమ్ముడు మల్లికార్జున కలిసి శ్రీనివాసులు కుటుంబసభ్యులతో ఘర్షణకు దిగారు. గొడవలో ఓ వర్గంలోని కొండప్ప, శ్రీనివాసులు గాయపడగా మరో వర్గంలోని వెంకటరమణ గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరి అదృశ్యంపై కేసులు నమోదు



డి.వెంకటేష్

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యంపై కేసులు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ వలిబసు తెలిపారు. కురబలకోట మండలం కోనంగివారిపల్లెకు చెందిన పెద్ద వెంకటరమణ కుమారుడు డి.వెంకటేష్(30) జూన్ 19వతేదీన మదనపల్లె పట్టణంలోని ఆర్.ఆర్ స్ట్రీట్ నుంచి మానసిక ఆరోగ్యం సరిలేక ఎక్కడికో వెళ్లిపోయాడు. అదే విధంగా పట్టణంలోని బెంగుళూరు రోడ్డులోని మదరసాలో ఉంటున్న జగన్ కాలనీకి చెందిన సున్ని ఉస్మాన్‌అలీ కుమారుడు సున్ని సులేమాన్ అలీ(12) జూన్ 29న మదరసా నుంచి బయటకు వచ్చి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆయా ఘటనలపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫొటోలలోని వ్యక్తులు ఎవరికైనా కన్పిస్తే వన్‌టౌన్ సీఐ ఫోన్ నంబర్ 9440796739 కు తెలియజేయాలన్నారు.

రెండు లారీలు, టిప్పర్ సీజ్



పట్టుకుని సీజ్ చేసిన లారీలు, టిప్పర్

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండలం కె.వెంకన్నగారి పల్లె సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో తనిఖీలు చేసి రెండు లారీలు, టిప్పర్ సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న వాహనాలను రెవెన్యూ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

రైతును ముంచుతున్న నకిలీ



అనుమానాస్పద ఎరువులను నీటిలో కలిపి శ్యాంపిల్స్‌ను పరిక్షిస్తున్న వ్యవసాయాధికారులు

గుర్రంకొండలోని పలు దుకాణాల్లో డీలర్లు విక్రయిస్తున్న ఎరువులు, పురుగుల మందులతో రైతులు నట్టేట మునిగి లక్షలాది రుపాయలు రైతులు నష్టపోతున్నారు. గతంలో వ్యవసాయ ల్యాబ్ పరీక్షల్లో సేకరించిన శ్యాంపిల్స్‌లో నిబంధనల మేరకు ఉండాల్సిన మందు మోతాదు కంటే ఎక్కువగా ఉన్నట్లు సేకరించిన తొమ్మిది నెలల తర్వాత వాస్తవం వెలుగు చూసింది. ఐదు రోజుల కిందట గుర్రంకొండలో నకిలీ ఎరువులతో మరోసారి రైతులు నష్టపోయారు. దీంతో గుర్రంకొండలోని ఎరువుల దుకాణాల వద్ద ధర్నా నిర్వహించడంతో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి శ్యాంపిల్స్ ల్యాబ్‌కు పంపించారు. ఇలా తూతూమంత్ర దాడులు తప్పితే చర్యలు తీసుకొన్న దాఖలాలు లేవు.

- గుర్రంకొండలో యథేచ్ఛగా నకిలీ ఎరువుల విక్రయం
- లక్షలాది రూపాయల టమాటా పంట నష్టపోతున్న రైతులు
- ఎరువులను ల్యాబ్‌కు పంపిన అధికారులు



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

గుర్రంకొండ:గుర్రంకొండలోని ఎరువుల దుకాణాల్లో డీలర్లు నకిలీ ఎరువులు విక్రయిస్తూ రైతుల పొట్టకొడుతున్నారు. లక్షలాది రుపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలు తీరా చేతికొచ్చే సమయానికి డీలర్ల అత్యాశ, అక్రమ సంపాదన కారణంగా వారు విక్రయించే నకిలీ ఎరువులతో రైతులు నట్టేట మునుగుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు నకిలీ ఎరువుల బారిన పడి టమాటా పంట పోగొట్టుకొన్నారు. టమాటాకు మించి ధరలున్న సమయంలో నకిలీ ఎరువుల కారణంగా పంటలు నష్టపోతుండడం గమనార్హం. డీలర్ల వద్ద అప్పుచేసి ఎరువు కొనుగోలు చేసే రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. డీలర్లు ఇచ్చిన ఎరువులు మాత్రమే రైతులు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

బయట ప్రాంతాల నుంచి తరలింపు

గుర్రంకొండలోని పలు ఎరువుల దుకాణాలకు కర్నాటక, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, మన జిల్లాలోని అంగళ్లు నుంచి పెద్ద ఎత్తున నకిలీ ఎరువులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అసలైన ఎరువు బస్తా లోపలి భాగంలో మళ్లీ కవర్ వేసి మందు అందులో ఉంచి ప్యాకింగ్ చేస్తారు. నకిలీ డ్రిప్ ఎరువు బస్తా పరిశీలించగా ప్యాకింగ్ వేర్వేరుగా ఉన్నట్లు గుర్తించారు. బస్తాలోపల ఒక కవర్‌తో పాటు, మరో కవర్ వేసి మందు ప్యాకింగ్ చేసినట్లు ఉంది. కొన్ని రసాయన ఎరువు మిశ్రమాలతోపాటు యూరియా, ఉప్పు కలిపిన ఎరువు బస్తాల్లో నింపినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్లో యూరియా బస్తా రూ.266 కాగా ఇదే బస్తాను ఉప్పుతో కలిపి డ్రిప్ ఎరువు అంటూ రూ.4400 వసూలు చేస్తున్నారు. నకిలీ బస్తా మీద సగటున రూ.3500 నుంచి రూ.3800 వరకు లాభం గడిస్తున్నారు. రాత్రిళ్లు బయట ప్రాంతాల నుంచి వాహనాల్లో దుకాణాలకు నకిలీ ఎరువులు సరఫరా అవుతున్నాయి. కొందరు స్టాకు తీసుకొచ్చి పట్టణంలోని ఆరు గోదాముల్లో అనధికారికంగా ఉంచినట్లు సమాచారం. మరింత మంది ఆటోలలో తెప్పించుకొని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ అక్రమంగా దోచుకొంటున్నారు. ఎవరైనా రైతు నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వమని అడిగినా.. డీలర్లు వాతావరణం సాకు చూపి మోసాన్ని కప్పిపుచ్చుతున్నారు. బిల్లులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. రసీదులు ఎందుకు ఇవ్వరని ఎదురు ప్రశ్నిస్తే మధ్యవర్తుల ద్వారా రైతుల నోళ్లు మూయిస్తున్నారు.

శ్యాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

ఐదు రోజుల కిందట స్థానిక బస్టాండులోని ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయాధికారులు దాడులు నిర్వహించి నిషేధిత, అనుమతి లేని ఎరువు, పురుగు మందును డీలర్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కొన్ని అనుమానాస్పద ఎరువుల శ్యాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అహ్మదాబాద్, ఫరీదాబాద్ పట్టణాల్లోని ల్యాబ్‌ల నుంచి ఫలితాలు వస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. గతంలో నకిలీ ఎరువులని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోలేదు. జిల్లా అధికారులు స్పందించకపోవడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలవనున్నట్లు బాధిత రైతులు తెలిపారు. రైతుకు అన్యాయం జరిగితే తూతూమంత్ర చర్యలు చేపడుతున్నారే గానీ న్యాయం జరగడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట నష్టపోయాం



నకిలీ ఎరువులతో గతంలో టమాటా పంట నష్టపోయా, మార్కెట్లో టమాటాకు మంచి ధర ఉన్న సమయంలో గుర్రంకొండలోని ఎరువుల దుకాణాల డీలర్లు నకిలీ మందు ఇచ్చారు. వాటిని పంటపై పిచికారీ చేస్తే కాయలు పసుపురంగులోకి మారిపోయాయి. పంట మొత్తం రంగు మారి దెబ్బతింది. రెండు ఎకరాల్లో పంటనష్టపోయాను. ఇదే మిటని ప్రశ్నిస్తే డీలర్లు బిల్లులు ఇవ్వలేదు. నష్ట పరిహారం చెల్లించలేదు. అధికారులు పట్టించుకోలేదు.

\- అనిల్, రైతు, చెర్లోపల్లె

దెబ్బతిన్న టమాటా



ఎకరం పొలం కౌలుకు తీసుకొని టమాటా పంట సాగు చేశా. జూన్ 19న గుర్రంకొండ బస్టాండులోని ఓ ఎరువుల దుకాణంలో టమాటా సైజు పెరిగేందుకు, పూత పిందె అభివృద్ధి చెందేలా 52:34 డ్రిప్ మందు బస్తాను కొనుగోలు చేశాను. రూ.4400 ఎరువుల దుకాణం యజమానికి చెల్లించినా రసీదు ఇవ్వకుండా పేపర్‌పై రాసిచ్చాడు. ఎరువు నీటిలో వేయగా...గుళికలు గట్టిగా గడ్డ కట్టి కనిపించాయి. పంట రంగు మారిపోవడంతో దుకాణ దారుడిని నిలదీసినా న్యాయం జరగలేదు.

\- రెడ్డిశేఖర్, టమాటా రైతు, శీలంవారిపల్లె

చట్టపరంగా చర్యలు తీసుకొంటాం



ఐదు రోజుల కింద గుర్రంకొండ బస్టాండులోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేశాను. రైతుల ముందే కొన్ని రకాల డ్రిప్‌ఎరువుల శాంపిల్స్ సేకరించాను. వాటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ల్యాబ్‌కు పంపించాం. ల్యాబ్ రిపోర్ట్ రాగానే పరిశీలించి అవి నకిలీ ఎరువులని తేలితే చట్టపరంగా చర్యలు తీసుకొంటాం.

\- నవీన్‌కుమార్‌రెడ్డి, ఏవో, గుర్రంకొండ



గడ్డ కట్టిన ఎరువు

ముదిరిన భూ వివాదం

బి.కొత్తకోట : భూ వివాదం ముదురుతోంది. ఒకే భూమికి సంబంధించి పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఎవరికీ న్యాయం చేయలేక బి.కొత్తకోట పోలీసులు ఏకంగా మూడు కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గుమ్మసముద్రం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్-667 పొలంలో భూమి ఉంది. వేరుశెనగ పంట సాగు చేయగా ఈ నెల 13వ తేదీన అమరనాథ్, వి.వెంకటరమణ, పి.శ్రీనివాసులు, బి.నరసింహులు, ట్రాక్టర్ డ్రైవర్ బి.రవితో దౌర్జన్యంగా పొలంలోకి ప్రవేశించి విత్తిన పంటను దున్నేశారని బి.కొత్తకోట పట్టణానికి చెందిన బి.రమేష్ భార్య బి.అరుణ ఫిర్యాదు చేశారు. తన పొలం కబ్జా చేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఇదే భూమికి సంబంధించి గుమ్మసముద్రం పంచాయతీ బుచ్చిరెడ్డిగారి పల్లెకు చెందిన బి.రవి మరో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 667లో వి.వెంకటరమణ నుంచి 30 సెంట్ల భూమిని గుత్తకు తీసుకుని పంట సాగు చేసుకుంటుండగా బి.కొత్తకోటకు చెందిన వ్యక్తులు వేరుశెనగ పంట దున్నేయడమేగాక, కులం పేరుతో దూషించి గెంటేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఈ కేసులో బి.రమేష్, బి.అరుణ, వారి కుమారుడు, అరుణ తండ్రి కె.మహేష్, కె.నందకిశోర్, బి.నటరాజ్, ట్రాక్టర్ డ్రైవర్ కె.వెంకటనారాయణలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బొజ్జానాయక్ తెలిపారు. ఈ భూమికి సంబంధించి బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన బి.వెంకటరమణ ఇంకో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ రవీంద్రనాయక్ తెలిపారు. సర్వే నంబర్ 667లో వెంకటరమణ వేరుశెనగ విత్తి పంట సాగు చేయగా బి.రమేష్, బి.అరుణ, వీరి కుమారుడు, అరుణ తండ్రి, కే.మహేష్, కే.నందకిశోర్, బి.నటరాజ్, ట్రాక్టర్ డ్రైవర్ కె.వెంకటనారాయణలు దౌర్జన్యంగా పంట దున్నేశారని, అడ్డుపడిన తనను పొలం నుంచి లాక్కొచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రెండు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, మరో సాధారణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పులుసుమానిపెంట కేసు

కొందరు తన భూమిలో అక్రమంగా ప్రవేశించి పొలం దున్నుతుంటే అడ్డుకున్నారని మండలంలోని మొటుకుపల్లె పంచాయతీ పులుసుమానిపెంటకు చెందిన కె.చంద్రప్ప ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బి.రెడ్డెప్పనాయక్ వివరాల మేరకు.. సర్వే నంబర్ 2257లో ఇద్దరికి చెందిన భూమి ఉంది. వారిలో కళావతి నుంచి ఒక భాగం 13.15 ఎకరాలను చంద్రప్ప కొనుగోలు చేశాడు. ఈ భూమి చంద్రప్ప కుమార్తె శిల్ప రిజిస్టర్ చేసిచ్చారు. అయితే ఇదే సర్వే నంబర్‌లోని మరో సగ భాగం కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ భూమి కూడా వారిదే అంటూ పంట సాగు చేయనీయకుండా అడ్డు పడుతున్నారని, గతంలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా వెంకటనారాయణ, ఆయన అనుచరులు వచ్చి అడ్డుకుని కులం పేరుతో దూషించారని చంద్రప్ప ఫిర్యాదు చేశారు. దీంతో అమరనాథ్, వెంకట నారాయణలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని తెలిపారు.

గడ్డి కోసుకెళ్లారని..

తన పొలంలో గడ్డిని కోసుకెళ్లారని మహిళా రైతు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎం.రవీంద్రనాయక్ తెలిపారు. మండలంలోని ఓబిరెడ్డిగారిపల్లెకు చెందిన కే.నాగమణి తన పొలంలో రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కుశలమ్మ, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, పార్వతమ్మ, ఎల్లమ్మ, పార్వతి, శకుంతలమ్మ, రాజారెడ్డి అక్రమంగా ప్రవేశించి గడ్డి కోసుకెళ్లారని ఫిర్యాదు చేశారు. 10 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జడల స్వామికి కన్నీటి వీడ్కోలు



జడలస్వామి పాడెమోస్తున్న భక్తులు

రాజంపేట టౌన్ : జడల స్వామికి భక్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. రాజంపేట మండలం కూచివారిపల్లె సాయిబాబా గుడికి సమీపంలో భక్తుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచగా ఉదయం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, సాధువులు తరలివచ్చి బరువెక్కిన హృదయాలతో నివాళులర్పించారు. గ్రామంలో జన సందోహం కనిపించింది. అనంతరం జడలస్వామి అంత్యక్రియలు నిర్వహించారు. భక్తులు ఆయన పాడె మోసేందుకు పోటీపడ్డారు. భౌతికకాయాన్ని సమాధిలో పీఠంపై కూర్చోపెట్టాక చివరి చూపు చూసేందుకు భక్తులు సమాధి వద్దకు రావడంతో తోపులాట జరిగింది.

కన్నతల్లిలా చూసిన వెంకటసుబ్బమ్మ



వెంకటసుబ్బమ్మ, జడల స్వామి భక్తురాలు

రాజంపేట మండలం ఆర్.బుడుగుంటపల్లెకు చెందిన పులపుత్తూరు వెంకట సుబ్బమ్మ జడల స్వామిని దశాబ్దానికి పైగా కన్నబిడ్డలా చూసింది. నిత్యం ఆమె తన ఇంటిలో వంట చేసుకొని ఆర్.బుడుగుంటపల్లె నుంచి రాజంపేటకు బస్సులో వచ్చి కూచివారిపల్లె, జానీబాషాపురం ప్రాంతాలలో ఆయనను వెతికి భోజనం తినిపించేది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన వద్దే ఉండి సపర్యలు చేసి సాయంత్రం తన ఇంటికి వెళ్లేది. జడలస్వామి అనారోగ్యానికి గురికావడంతో కడప రిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి 15 రోజుల పాటు సపర్యలు చేసింది. చివరికి అదే హాస్పిటల్‌లో ఆమె చేతితో పాలు తాగి శివైక్యం అయ్యారు. భక్తులు ఆమెను ప్రత్యేకంగా గౌరవిస్తూ సేవలను కొనియాడేవారు. ఏ బంధం లేకపోయినా వెంకటసుబ్బమ్మ జడలస్వామిని కన్నబిడ్డలా చూడటం విశేషం.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



రజక సంఘం నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్ : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఉమ్మడి కడప జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చేలోరవి డిమాండ్ చేశారు. పట్టణంలోని రాయుడు కాలనీలోని రామాలయం వద్ద జరిగిన జిల్లా రజక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులు ఎన్ని పర్యాయాలు ఆందోళన చేసినా పాలకులకు చీమ కుట్టినట్లయినా లేదన్నారు. అనంతరం జిల్లా రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.రమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.వి.కె.రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా వీరబల్లి శ్రీనివాసులు, కోశాధికారిగా వి.అంజనమ్మ, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.వి.రమణ, పి.సుబ్బరాయుడు, ఎస్.పెంచలయ్య, కృష్ణయ్య, చంద్రాయుడు, వెంకటరమణ, జ్ఞానమూర్తి, నాగరాజు, నారాయణ, రెడ్డిప్రసాద్, లక్ష్మినారాయణ, వెంకటరమణ, కార్యదర్శులుగా వెంకట సుబ్బయ్య, శంకర్, బాలరాజు, ప్రసాద్, రమేష్, నటశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా విజమ్మ, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మమ్మ, సరస్వతమ్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



ద్విచక్రవాహనం అదుపు తప్పి గాయపడిన లారీ డ్రైవర్ శంకర

మదనపల్లె: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీ చేదబావిపల్లెకు చెందిన లారీ డ్రైవర్ శంకర(50) తన బంధువు సరసమ్మ(46)తో కలిసి మదనపల్లెకు వస్తుండగా, మార్గ మధ్యంలోని కర్నాటక రాయల్పాడు సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో శంకరకు తలకు తీవ్రగాయం కాగా, సరసమ్మ స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం శంకర పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ ఆచార్లపల్లెకు చెందిన కే.వెంకటేష్(52) శనివారం రాత్రి ఇంటివద్ద నుంచి పొలానికి నడిచి వెళ్తుండగా అంగళ్లకు చెందిన రాజు ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడగా, రాజు స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కడపలో దొంగను పట్టుకున్న కేరళ పోలీసులు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తలదాచుకున్న వైజాగ్‌కు చెందిన దొంగ సత్తిబాబును కేరళ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు..... వైజాగ్‌లోని గాజువాక ప్రాంతానికి చెందిన సత్తిబాబు పలు పేర్లతో చెలామణి అవుతున్నారు. కేరళ రాష్ట్రానికి వెళ్లి అక్కడ పలు దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఫోన్ కాంటాక్ట్ ఆధారంగా కడపకు కేరళ పోలీసులు చేరుకుని ఆర్టీసి బస్టాండులో పట్టుకున్నారు. తమ రాష్ట్రానికి విచారణకు తీసుకుని వెళ్లినట్లు తెలిసింది.

అసలే మైనర్.. ఆపై ముగ్గురితో డ్రైవింగ్



పిల్లలతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : మైనర్ బాలుడి వయసు 12 ఏళ్లు. మరో ముగ్గురిని స్కూటీలో కూర్చోపెట్టుకొని డ్రైవింగ్ చేస్తున్నాడు. నలుగురు పిల్లలు స్కూటీలో వెళ్తున్న దృశ్యం ఆదివారం ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ కంట పడింది. గాంధీ రోడ్డు గుండా వెళ్తున్న డీఎస్పీ పిల్లలు వెళ్తున్న స్కూటీని ఆపారు. ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించగా దుకాణానికి వచ్చినట్లు పిల్లలు తెలిపారు. వెంటనే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్ పిల్లలు స్కూటీ నడపడం ప్రమాదకరమని చెప్పారు. గాంధీరోడ్డు చాలా రద్దీగా ఉండే ఏరియా అని.. అలాంటి చోట చిన్న పిల్లలు స్కూటీ నడపడం అత్యంత ప్రమాదకర మన్నారు. బాలుడికి సరిగా కాళ్లు కూడా అందవని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించరాదని సూచించారు. ఇకపై స్కూటీ ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు.

ఆదమరిస్తే.. విషాహారమే



హోటళ్లలో కలుషితమైన మాంసం



ఇటీవల దాడులు నిర్వహించిన ఫుడ్ కంట్రోల్ అధికారులు(ఫైల్)

- కలుషిత ఆహారం అందిస్తున్న వారికి తాఖీదులు
- భోజన ప్రియులను ఆకర్షించే హోర్డింగులతో మోసం

జమ్మలమడుగు : జిల్లాలో కడప నగరం, ముద్దనూరు రహదారి, ప్రొద్దుటూరు, తాడిపత్రి రహదారుల్లో రెస్టారెంట్లు భోజన ప్రియులను ఆకర్షిస్తున్నాయి. భారీ హోర్డింగ్‌లు పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయితే ఇక్కడ హోటళ్లు, రెస్టారెంట్లు సక్రమంగా నడకపోవడంతో చాలా వరకూ మూతపడ్డాయి. దీంతో పట్టణంలో రెస్టారెంట్ల యాజమాన్యాలు రెచ్చిపోయి కస్టమర్లకు కలుషిత ఆహారమే పెడుతూ జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల ఫుడ్ కంట్రోల్ అధికారులు పట్టణంలోని కొన్ని హోటళ్లు, బేకరీలపై దాడులు నిర్వహించి ఆహార పదార్థాలు పరిశీలించగా కుళ్లిన మాంసం పెడుతున్నట్లు తేల్చారు. మాంసం నిల్వ ఉంచడం కోసం మరణించిన వాటి శరీరాలు కుళ్లిపోకుండా కెమికల్స్ వాడుతున్నారు. స్టోర్‌బియ్యంతో తయారుచేసిన భోజనం పెడుతూ కస్టమర్ల వద్ద డబ్బు గుంజుతున్నారు. కూరలు రుచిగా ఉండాలని కొవ్వుతోపాటు టేస్టీ సాల్ట్ వేసి మనుషుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దాడులు చేసిన అధికారులు వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా తాఖీదులిచ్చి సరిపెడుతున్నారు. అధికారులు రెస్టారెంట్ యజమానులపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కుళ్లిన ఆకు కూరలు, కూరగాయలను తక్కువ ధరకు తెచ్చి వండి పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని చెబుతూ తాము ఏమీ చేయలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుచి పేరుతో.. దగా



హోటళ్లు, రెస్టారెంట్లలో బిరియానీ, మాంసం, చికెన్ వంటి ఆహార పదార్థాలు రుచిగా ఉండాలనే ఉద్దేశ్యంతో కొవ్వు పదార్థాలు ఎక్కువగా వేస్తున్నారు. అదీ ఇతర జంతువుల కొవ్వును పెద్దముడియం ప్రాంతంలోని ఓ గ్రామం నుంచి హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అధికారులు తనిఖీలు ముమ్మరం చేసి అటువంటి రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

\- ఇమ్మానుయేల్, మాల మహానాడు అధ్యక్షుడు